
సాక్షి
బాపట్ల
మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం


అచ్చంపేట: స్థానిక సీతారామస్వామివారి దేవాలయం వద్ద సోమవారం శ్రీరామపట్టాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 516.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 2,053 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సింహ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీ రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో స్వామి వారికి సోమవారం సింహ వాహనంపై పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

న్యూస్‌రీల్

మత్స్యశాఖ సంయుక్త సంచాలకులుగా శ్రీనివాస్‌నాయక్



బాపట్ల: బాపట్ల మత్స్యశాఖ సంయుక్త సంచాలకులుగా ఓ. శ్రీనివాస్‌నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి ఉపసంచాలకులుగా పని చేస్తూ పదోన్నతిపై బాపట్లకు వచ్చారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని, జేసీ ప్రఖర్‌జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మత్స్యకారులకు అందుబాటులో ఉంటానన్నారు. వారి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

ఇంటర్ అడ్మిషన్లు చేపట్టండి

డీఐఈఓ నీలావతిదేవి

నరసరావుపేట ఈస్ట్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాలలో పనిచేస్తున్న ఇంటర్మీడియెట్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలను చేపట్టాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి సోమవారం తెలిపారు. ఈమేరకు ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు తెలియచేసినట్టు వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకుల కళాశాలలతోపాటు మోడల్ స్కూళ్లు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, గిరిజన సంక్షేమ కళాశాలలు తదితర ప్రభుత్వ యాజమాన్య కళాశాలల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థుల ప్రవేశాలను పెంచేలా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం వంటి సంక్షేమ పథకాలను విద్యార్థుల దృష్టికి తీసుకవెళ్లాలన్నారు. ఇప్పటికే ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేపట్టినట్టు వివరించారు. కాగా, ఇంటర్ ఫలితాలను రెండవ వారంలో విడుదల చేసేందుకు బోర్డు కసరత్తు చేస్తుందని తెలిపారు.


ముప్పాళ్లలో భారీ వర్షం

ముప్పాళ్ళ: ముప్పాళ్లలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమవడంతో పాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండవేడితో అల్లాడిన ప్రజలకు కొంత ఉపశమనం లభించినప్పటికీ ఈదురుగాలులతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కల్లాల్లో ఉన్న మొక్కజొన్న, మిరప, పసుపు పంట దిగుబడులు తడవకుండా కాపాడుకునేందుకు పట్టలు కప్పేందుకు పరుగులు పెట్టారు. ఇప్పటికే పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నామని, తడిస్తే కొనేవారు ఉండరని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గుంటూరు నగరంలో పర్యటించిన ఐజీ

పట్నంబజారు: గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సోమవారం గుటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పాతగుంటూరు పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో ఆనందపేటలో జరిగిన వృద్ధురాలు పఠాన్ ఖాజాబీ హత్య, ఆమె కుటుంబ సభ్యులపై జరిగిన దాడి నేపథ్యంలో సంబంధిత కేసు వివరాలు అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో కేసుకు సంబంధించి దర్యాప్తు చేపట్టాలని, నిందితులను త్వరితగతిన అదుపులోకి తీసుకోవాలని స్టేషన్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. అనంతరం ఆనందపేట 2వలైనులో హత్య జరిగిన ప్రాంతాన్ని కూడా ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పరిశీలించారు. ఐజీ వెంట ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్య, పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వై.వీరసోమయ్య తదితరులు ఉన్నారు.

1,53,787 బస్తాలు మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,53,787 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,37,288 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,300 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 64,276 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

ప్రజలను మత్తులో ముంచెత్తి అందినకాడికి దండుకోవడమే పనిగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మరోవైపు ఇప్పటికే దాదాపుగా అన్ని మద్యం దుకాణాలు దక్కించుకున్న పచ్చనేతలు ఇప్పుడు బెల్టుషాపుల పేరుతో ప్రజలను దోచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వారికి వత్తాసు పలుకుతూ విధుల్లో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తును కలెక్టర్ సరెండర్ చేశారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఎటూ తేల్చకపోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

మామూళ్ల మత్తు.. పచ్చ మద్దత్తు!

- పచ్చ నేతల ఆదేశాలతో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు
- వసూళ్ల పర్వంలో కుమ్ములాటలు
- వర్గాలుగా విడిపోయిన అధికారులు
- రచ్చ రోడ్డెక్కడంతో సూపరింటెండెంట్ దేవదత్తును సరెండర్ చేసిన కలెక్టర్
- సరెండర్ నిర్ధారించని కమిషనరేట్
- త్రిశంకు స్వర్గంలో దేవదత్తు.. కొనసాగుతున్న సస్పెన్స్
- ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా వెంకటేశ్వర్లు
- పచ్చనేతల అండతో తిరిగి బాపట్ల వచ్చేందుకు దేవదత్తు యత్నం



జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు కావడం, నాటు సారా ఏరులై పారడం, మద్యం షాపులు నిబంధనలకు తూట్లు పొడిచి అక్రమ వ్యాపారాలు సాగించడానికి ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తే కారణమని, ఈ విషయమై తాను పదేపదే చెప్పినా విధుల్లో అలసత్వంగా ఉన్నారంటూ జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆయనను ఎక్సైజ్ కమిషన్‌రేట్‌కు సరెండర్ చేశారు. ఈ మేరకు గత నెల 24న లేఖ రాశారు. అదే సమయంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఉన్న వెంకటేశ్వర్లుకు ఇన్‌చార్జిగా ఆ బాధ్యతలు అప్పగించారు. లేఖ రాసి దాదాపు రెండు వారాలు అవుతున్నా ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది.

అండగా కీలక నాయకులు

వాస్తవానికి దేవదత్తు జిల్లా అధికారి కావడంతో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే ఎక్సైజ్ మంత్రికి తెలియకుండా ప్రిన్సిపల్ సెక్రటరీ తన నిర్ణయాన్ని వెలువరించే అవకాశం లేదు. ఇదే అదునుగా దేవదత్తు ఇప్పటికే జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సుతో ఎక్సైజ్ మంత్రిని కలిసినట్లు సమాచారం. జిల్లాలో బెల్టుషాపులు అధికంగా పెట్టించానన్న కారణంతోనే కలెక్టర్ తనను సరెండర్ చేశారని, పచ్చ పార్టీ నేతల కోసమే తాను ఆ నిర్ణయం తీసుకున్నానంటూ దేవదత్తు మంత్రి వద్ద మొర పెట్టుకున్నట్లు సమాచారం. పైగా జిల్లా మంత్రులు గొట్టిపాటి, అనగానిలతో పాటు మిగిలిన ఎమ్మెల్యేలతోనూ దేవదత్తు ఎక్సైజ్ మంత్రికి సిఫార్సు చేయించినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలపై దేవదత్తుకు వ్యతిరేకంగా ప్రిన్సిపల్ సెక్రటరీ నిర్ణయం తీసుకోలేదని సమాచారం. ఇదే సమయంలో కలెక్టర్ సరెండర్ ఆర్డర్‌ను క్యాన్సిల్ చేయించుకొని తిరిగి బాపట్లకు సూపరింటెండెంట్‌గా వచ్చేందుకు దేవదత్తు పావులు కదుపుతున్నారు. ఇందుకు జిల్లాకు చెందిన ఒక మంత్రితోపాటు మద్యం షాపులు అధికంగా దక్కించుకున్న కొందరు ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. దేవదత్తు కొనసాగితే బెల్టు షాపులు ఏర్పాటు, నిబంధనల్లో సడలింపు ఉంటుందని, అధిక ధరలకు మద్యం విక్రయించుకోవచ్చని వారు కలెక్టర్‌కు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితిలో కలెక్టర్ ఎలా స్పందిస్తారన్నది వేచి చూడాలి.

మామూళ్ల వ్యవహారంలోనే ..

జిల్లాలో 117 సాధారణ, 10 కల్లుగీత కార్మికుల దుకాణాలతో కలిపి మొత్తం 127 మద్యం దుకాణాలు ఉన్నాయి. దాదాపు అన్ని దుకాణాలు పచ్చనేతల స్వాధీనంలోనే ఉన్నాయి. వీరు జిల్లావ్యాప్తంగా రెండు వేలకు పైగా బెల్టు దుకాణాలు నెలకొల్పారు. మద్యం దుకాణాల్లో క్వార్టర్ బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 అదనంగా, బెల్టుషాపుల్లో రూ.50 నుంచి రూ.80 అధికంగా విక్రయిస్తున్నారు. మద్యం దుకాణాల్లో డిమాండ్ ఉన్న బ్రాండ్లను బయటకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. బెల్టు షాపులపై మొక్కుబడిగా దాడులు చేసి ఒక్కో దాడికి రూ. 50 నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా షాపులను ఎక్కువ సమయం వ్యాపారం చేసుకునేలా అనుమతిస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా జిల్లాలోని ఒక్కో మద్యం దుకాణం నుంచి నెలకు రూ.15 వేల చొప్పున 127 షాపుల నుంచి నెలకు రూ.20 లక్షలు వసూలు చేస్తున్నారు. అంతటితో వదలక ప్రతి ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు నిత్యం టీ, కాఫీలు మొదలు భోజనాలు, చికెన్, మటన్, ఫిష్ సైతం మద్యం షాపుల సిండికేట్ నుంచే తెప్పించుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. రేపల్లె, వేమూరు, బాపట్ల, చీరాల, పర్చూరు ప్రాంతాల్లో నాటుసారా తయారీ దారుల నుంచి నెల మామూళ్లు పుచ్చుకొని నియంత్రణను గాలికొదిలారు. అన్నిరకాల వసూళ్లతో కలుపుకొంటే జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ నెలకు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మరోవైపు నెల మామూళ్ల పంపకాల్లోనూ దేవదత్తు, మిగిలిన అధికారులకు మధ్య విబేధాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయాలన్నింటినీ దేవదత్తుకు వ్యతిరేకంగా ఉన్న కొందరు ఎక్సైజ్ అధికారులు ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరవేసినట్లు ప్రచారం ఉంది. మద్యం ధరలు, బెల్టు షాపులు, నాటు సారా వ్యవహారాలపై ప్రజలు లేదా ప్రజాసంఘాలు ఫిర్యాదు చేసినా ఎక్సైజ్ విభాగం ఏ మాత్రం స్పందించడం లేదు.

ఉత్తమ ప్రదర్శన 'నాన్న నేనొచ్చేస్తా'



ఎమ్మెల్యే గాంధీ నుంచి బహుమతి అందుకుంటున్న 'నాన్న నేనొచ్చేస్తా' బృందం

యడ్లపాడు: పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం నిర్వహించిన 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. కళానిలయం అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక ఎంవీ చౌదరి కళావేదిక ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు 10 నాటికలు ప్రదర్శించారు. ప్రతిరోజూ పండుగలా నిర్వహించిన ఈ పోటీలకు ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు. కళాభిమానులు మూడు రోజులు అర్ధరాత్రి వరకు ఉంటూ కళారూపాల్ని ఆద్యంతం తిలకించి ఆస్వాదించారు. నిత్యం ప్రేక్షకులకు వెయ్యి మందికి అల్పాహారం అందించడం, ప్రతిరోజూ 30 మంది చొప్పున 90 మందికి లక్కీడ్రా తీసి బహుమతుల్ని అందించారు. 15 మంది న్యాయనిర్ణేతలు, దాతలు, కళాకారులు, అతిథులు పలు రంగాలకు చెందిన ప్రముఖులకు జ్ఞాపికలు అందించి సత్కరించారు. ముత్తవరపు సురేష్‌బాబు సతీమణి ముత్తవరపు అరుణ కుమారి లేడీ ఆర్టిస్టులను ఆడపడుచు లాంఛనాలిచ్చి సత్కరించారు.

జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీల్లో అమృతలహరి థియేటర్ (గుంటూరు)వారి ''నాన్న నేనొచ్చేస్తా'' ఉత్తమ ప్రదర్శనగా ఎంపికై ంది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా యువభేరి థియేటర్స్(హైదరాబాద్) వారి 'నా శత్రువు' నాటిక, ఉత్తమ తృతీయ ప్రదర్శనగా శ్రీసాయి ఆర్ట్స్(కొలకలూరి) వారి 'జనరల్ బోగీలు' నాటిక నిలిచాయి.

కార్యక్రమంలో నాటక పరిషత్ ఉపాధ్యక్షుడు జరుగుల శంకరరావు, కార్యదర్శి ముత్తవరపు రామారావు, కోశాధికారి నూతలపాటి మాధవ రావు, కాళిదాసు, ఎం.పద్మారావు పాల్గొన్నారు.

ప్రాణ సంకటం

- కుక్కల స్వైరవిహారం
- గుంటూరు నగర ప్రజలు బెంబేలు
- గాలిలో పసిప్రాణాలు
- 2017లో కుక్కల దాడిలో ఓ బాలుడి మృతి
- కొద్దినెలల క్రితం బాలికపై దాడి
- తాజాగా మరో చిన్నారి బలి
- రోజూ శునకాల బారిన పడుతున్న బాధితులు
- జీజీహెచ్‌కు వస్తున్న కేసులు
- చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజలపై విరుచుకు పడుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు కుక్కకాట్లకు బలవుతున్నారు. అయినా నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యానికి తాజాగా ఆదివారం స్వర్ణ భారతినగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడు ఐజక్ బలయ్యాడు. కుక్క గొంతుకరుచుకుని తీసుకుపోవడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. 2017 డిసెంబర్‌లోనూ ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారి కుక్క కరవడంతో చనిపోయాడు. కొద్ది నెలల క్రితం సంపత్‌నగర్‌లో ఓ బాలికపై కుక్క దాడి చేసింది. స్థానికులు కుక్కను తరిమివేయడంతో గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఏడేళ్ల క్రితం హుస్సేన్‌నగర్, ఆంజనేయ కాలనీలో 9 మందిపై వీధి కుక్కలు దాడి చేసి కండలు పీకేశాయి. వీరిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. గుంటూరులో రోజూ ఏదోచోట కుక్కకాటుకు ప్రజలు బలవుతున్నారు. జీజీహెచ్, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

జనవరి 9 నుంచి ఆగిపోయిన ఏబీసీ ఆపరేషన్లు

గుంటూరు నగరంలో వీధి కుక్కల నియంత్రణ కోసం నగరపాలక సంస్థ గతంలో చర్యలు చేపట్టింది. ఏటుకూరు రోడ్డులో స్నేహ యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ (ఏబీసీ) ఆపరేషన్లు చేయించేది. ఈ ఆపరేషన్లు చేసినందుకు గాను ఒక కుక్కకు రూ.రెండు వేల వరకూ స్నేహ సంస్థకు చెల్లించేంది. అయితే నిబంధనలు పాటించకుండా ఆపరేషన్లు జరుగుతున్నాయని, స్టెరిలైజేషన్ సక్రమంగా ఉండటం లేదని, ఆపరేషన్ ద్వారా కుట్లు కూడా సక్రమంగా వేయడం లేదని, రికార్డ్స్ సక్రమంగా నిర్వహించడం లేదని కొందరు జంతుప్రేమికులు యానిమాల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేశారు. దీంతో గత ఏడాది అక్టోబర్ 18న గుంటూరుకు విచ్చేసిన యానిమల్ బోర్డ్ సభ్యులు స్నేహ సొసైటీ చేస్తున్న ఆపరేషన్లలో లోపాలున్నాయని గుర్తించి ఆపరేషన్లు చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. దీంతో జనవరి 9 నుంచి ఏబీసీ ఆపరేషన్లు ఆగిపోయాయి. ఆ తర్వాత మళ్లీ స్నేహ సంస్థ ఏబీసీ ఆపరేషన్లు చేసేందుకు అప్పీలు చేసుకోవడంతో జనవరి 24న యానిమల్ బోర్డ్ సభ్యులు గుంటూరు వచ్చి స్నేహ సంస్థ ఏబీసీ సెంటర్‌ను పరిశీలించారు. ఇంకా ఆపరేషన్ల నిర్వహణలో లోపాలు ఉన్నాయని సభ్యులు తేల్చారు. నగరపాలక సంస్థ తరుపునే ఆపరేషన్ల చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన ప్రక్రియను నగరపాలక సంస్థ అధికారులు చేపట్టారు.


ఆపరేషన్లు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు

నగరపాలక సంస్థ అధికారుల లెక్కల ప్రకారం గుంటూరు నగరంలో 31,400 కుక్కలు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. వీటిలో సుమారు 4,500 కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేసినట్లు చెబుతున్నారు. వీటి కోసం రూ.37,48,500 లక్షలు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. అయితే వీటిలో కూడా చాలా కుక్కలకు ఆపరేషన్లు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు పెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొద్ది నెలల క్రితం ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంహెచ్‌ఓగా పనిచేసిన ఓ అధికారి ఆధ్వర్యంలో ఏబీసీ ఆపరేషన్ల విషయంలో గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. రికార్డ్స్ పరిశీలించిన అధికారులకు ఆపరేషన్లు చేసిన లెక్కకు రికార్డ్స్‌లో చూపుతున్న లెక్కలకు తేడాలు ఉన్నాయని పసిగట్టినట్లు సమాచారం. కాని అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

కౌన్సిల్‌లో చర్చ

వీధి కుక్కల స్వైరవిహారం అంశం సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో చర్చకు వచ్చింది. వీధికుక్కల నియంత్రణలో అధికారుల వైఫల్యంపై వైఎస్సార్ సీపీ సభ్యులు నిలదీశారు. దీనికి స్పందించిన ప్రజారోగ్యధికారులు డిసెంబర్ 31 నాటికి నగరంలో ఉన్న వీధి కుక్కలకు వ్యాక్సినేషన్, ఏబీసీ ఆపరేషన్లు పూర్తి చేస్తామని ప్రకటించారు.

రాత్రి వేళల్లో బండి మీద వెళ్లాలంటే భయం



రాత్రి వేళల్లో రోడ్ల మీద బండి వెళ్లాలంటే భయంగా ఉంటుంది. ఎక్కడ ఎటు నుంచి కుక్కలు కరుస్తాయో అని..పలుమార్లు మా ప్రాంతంలో కుక్కల దాడిలో గాయాలపాలైయ్యారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

– నాని, నెహ్రూనగర్, గుంటూరు

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారుల ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకొని ప్రభుత్వానికి పంపాలని ఆయన చెప్పారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి ఆడియో తీసుకొని వారితో సెల్ఫీ దిగి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని చెప్పారు. జిల్లాలో జరిగిన డి.ఆర్.సి. సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యల రిపోర్టులను తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, డి.ఆర్.డి.ఎ. ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామ రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి ఎల్. భీమయ్య, జిల్లా గ్రామీణనీటి సరఫరా శాఖ ఎస్‌ఈ అనంత రాజు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శివలీల, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయండి

బాపట్ల: గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా చేపట్టిన సర్వే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల రాష్ట్ర కార్యదర్శి, ఆర్‌టీజీఎస్ సీఈవో కె భాస్కర్ ఈ సర్వేపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం అమరావతి నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇక్కడి అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వర్క్ ఫర్ హోం చేయడానికి ఎంతమంది యువత ఆసక్తిగా ఉన్నారనే అంశంపై దృష్టి సారించాలన్నారు. ఇంటింటా సర్వే చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వివరాలు నమోదు చేయాలన్నారు. ఆరేళ్లలోపు చిన్నారులందరికీ ఆధార్ కార్డు తప్పనిసరిగా వచ్చేలా చూడాలని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో సిబ్బందిని జనరల్ పర్పస్ సచివాలయాల గ్రూప్‌గా ఏర్పాటు చేయాలని సూచన చేశారు. మన మిత్ర సర్వే అవగాహన కార్యక్రమాలపై ఈ నెల 15 నుంచి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా నుంచి జీఎస్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి పద్మ, డీఎల్డీఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాల్యవివాహాలను అరికట్టాలి

బాపట్ల: బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ప్రజలకు సూచించారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని జిల్లా కలెక్టర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక పురపాలక సంఘ ఉన్నత పాఠశాల నుంచి పాత ఆర్టీసీ బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ సాగింది. అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు, చీరాల మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు. కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. తల్లీబిడ్డల మరణాలను అరికట్టాలని జిల్లా కలెక్టర్ అన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని తెలిపారు. ప్రభుత్వం అందించే వైద్య సేవలను క్రమం తప్పకుండా ఉపయోగించుకోవాలని అన్నారు. ఇంటి వద్ద ప్రసవాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బుడా ఛైర్మన్ శలగల రాజశేఖర్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి.గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

చీరాల: చీరాలలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని మున్సిపల్ కార్యాలయంలో జరుపుకోనీయకుండా కార్యాలయానికి తాళాలు వేసి తమను అగౌరవ పరిచేలా వ్యవహరించిన మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కౌన్సిలర్లు సోమవారం కలెక్టర్ జె.వెంకట మురళికి వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించాలని ఆదేశించినా స్థానిక మున్సిపల్ అధికారులు పెడచెవిన పెట్టి మున్సిపల్ చైర్మన్‌ను అవమానించారన్నారు. మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఆయన తగు చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

చిన్నారికి వైఎస్సార్ సీపీ నేతల నివాళి

గుంటూరురూరల్: కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారి మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా, నియోజకవర్గ ఇంచార్జ్ బలసాని కిరణ్ కుమార్ తదితరులు సోమవారం సందర్శించి నివాళులర్పించారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్నారి ఇంటికి వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించారు. తల్లిదండ్రులతో మాట్లాడి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులకుగానీ, కమిషనర్‌కు గానీ అడ్మినిస్ట్రేషన్‌పై నిబద్ధత లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారాన్ని గాలికి వదిలి కమిషనర్ సైతం టీడీపీ నాయకులతో కలిసి రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు. గతంలో జీజీహెచ్‌లో ఎలుకలు కరిచి చిన్నారి, నేడు కుక్కల దాడిలో మరో చిన్నారి మృత్యువాతకు గురయ్యాడన్నారు.



ఐజక్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న అంబటి రాంబాబు, నూరి ఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్ తదితరులు

కుటుంబ కలహాలతో కానిస్టేబుల్ ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

వేటపాలెం: పోలీసు కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ ప్రసాద్ పేటకు చెందిన కానిస్టేబుల్ బిల్లా రమేష్ (37) ఇంట్లో ఉరేసుకొని ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కానిస్టేబుల్ రమేష్ ఆదివారం విధుల నుంచి ఇంటికి వచ్చిన తరువాత ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. తండ్రి, అమ్మమ్మ ఇంటి బయట నిద్రించారు. సోమవారం ఉదయం ఇంట్లో నుంచి కుమారుడు బయటకు రాకపోవడంతో తండ్రి కంగారు పడ్డారు. చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు తీసి చూడగా ఇంట్లో ఉరేసుకొని కనిపించాడు. రమేష్ వెదుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. కుటుంబ గొడవల కారణంగా ఐదేళ్లుగా భార్య దూరంగా ఉంటోంది. పిల్లలను కూడా ఆమే చదివిస్తోంది. ఈ కేసు చీరాల కోర్టులో పెండింగ్‌లో ఉంది. చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు, వెదుళ్లపల్లి ఎస్సై భాగ్యరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

నాటికలు పరిషత్‌లకే పరిమితం కాకూడదు

యడ్లపాడు: నాటికలు కేవలం పరిషత్ ప్రదర్శనలకే పరిమితం కాకూడదని, క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజాచైతన్యానికి పాటు పడేలా చేయాలని సినీనటుడు అజయ్‌ఘోష్ చెప్పారు. పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించిన 22వ జాతీయస్థాయి పోటీల ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సామాజిక రుగ్మతలపై మరిన్ని నాటికలు రచించి, గ్రామాల్లో ప్రదర్శించాలని కోరారు. ఇక్కడి నాటికల పోటీల నిర్వహణ, నిబద్ధత, వాటి ఆదరణ తీరు తెలుగురాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ విషయంలో డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు అభినందనీయుడన్నారు. ఏటా పోటీల సమయంలో యడ్లపాడు వస్తానని, తనకు ఓ నాటిక వేసే అవకాశం ఇవ్వాలని కమిటీని కోరారు. దేశాన్ని కాపాడేందుకు కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకం కావాలని ఒకరితో అంటే నీకు అడిగే అర్హత ఉందా అంటూ తనను ప్రశ్నించారని, ఓ అభిమానిగా ధైర్యంగా ప్రశ్నించే హక్కు ఆ ఎర్రజెండానే ఇచ్చిందని వేదిక ద్వారా స్పష్టం చేశారు. నేటి యువత కమ్యూనిస్టు పోరాట యోధుడు సుందరయ్య గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ప్రజల దుస్థితిపై నాటకాలు రావాలి..

మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా రాష్ట్రంలో పేదరికం, కనీస అవసరాలు, తాగునీరు అందని అవస్థలు, కిడ్నీలు అమ్ముకునే దుస్థితిపై స్పందించి రచయితలు నాటకాలు రాయాలని కోరారు. తెలుగురాష్ట్రాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే అత్యధిక నాటక పరిషత్‌లు వెలుగొందుతున్నాయని తెలిపారు. తెలంగాణ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ట నాటక రంగాన్ని దాతలు, పరిషత్ నిర్వాహకులు, ముఖ్యంగా ప్రజలు బతికిస్తున్నారన్నారు.

ప్రభుత్వ ఆమోదానికి జెడ్పీ బడ్జెట్

- ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించుకోలేని దుస్థితి
- వరుసగా రెండుసార్లు వాయిదా పడిన సర్వసభ్య సమావేశం
- ఏకపక్ష పనులు అనుమతులపై తీవ్ర అభ్యంతరం
- పార్టీ ఫిరాయించిన చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఏకతాటిపైకి వచ్చిన జెడ్పీటీసీలు
- బడ్జెట్ ఆమోదం తమ వల్ల కాదంటూ ప్రభుత్వానికి నివేదన
- గత ఏడాది మార్చి 31 నాటికే ఆమోదించుకోవాల్సిన బడ్జెట్
- పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి ప్రభుత్వానికి పంపిన సీఈవో


గుంటూరు జిల్లా పరిషత్ భవనం (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఆమోదం సాధ్యం కాలేదు. వరుసగా రెండుసార్లు వాయిదా పడిన సర్వసభ్య సమావేశంలో బడ్జెట్ ఆమోదం పొందలేకపోయిన దృష్ట్యా పంచాతీరాజ్ చట్టంలోని సెక్షన్ 199 సబ్ రూల్ 3 కింద బడ్జెట్‌ను ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపినట్లు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు సోమవారం చెప్పారు.

పార్టీ ఫిరాయించిన చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా..

జెడ్పీ ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించేందుకు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా గత నెల 15న ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. వైఎస్సార్ సీపీ నుంచి జెడ్పీటీసీగా గెలిచిన హెనీ క్రిస్టినా గత సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్టీ ఫిరాంచడంతో పాలకవర్గంలో సింహభాగమైన వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు ఆమె తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కీలకమైన బడ్జెట్ ఆమోదం కోసం రెండు వారాల వ్యవధిలో గత నెల 29న రెండోసారి సమావేశాన్ని ఏర్పాటు చేసినా, అదే రోజు టీడీపీ ఆవిర్భావ దినోత్సవమని, బడ్జెట్ ఆమోదానికి కావాల్సిన సంఖ్యలో టీడీపీ ప్రజా ప్రతినిధులు హాజరు కావడం లేదనే సమాచారంతో రెండు రోజుల ముందుగా సమావేశాన్ని వాయిదా వేశారు. చైర్‌పర్సన్ హోదాలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు జెడ్పీటీసీల అనుమతి లేకుండా, వారికి కనీస సమాచారమివ్వకుండా ఏకపక్షంగా పనులను మంజూరు చేస్తున్న విషయమై గతేడాది కాలంగా జెడ్పీటీసీలు ప్రతి సర్వసభ్య సమావేశంలోనూ గళం విప్పుతున్నారు. జెడ్పీ పాలకవర్గంలో భాగస్వాములైన జెడ్పీటీసీలను పక్కనపెట్టి అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫార్సులకు ప్రాధాన్యమిస్తూ, వారు చెప్పిన పనులకు జీ హుజూర్ అనడంపై జెడ్పీటీసీలు తీవ్ర అగ్రహంతో ఉన్నారు. ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో జెడ్పీటీసీలకు తెలియకుండా, సమావేశంలో ఆమోదింపచేయకుండా రూ.12 కోట్ల అభివృద్ధి పనులకు ఏకపక్షంగా అనుమతులు ఇవ్వడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, జెడ్పీటీసీలందరూ ఏకతాటిపైకి వచ్చి సమావేశానికి గైర్హాజరయ్యారు.

> **చైర్‌పర్సన్ తన అస్తిత్వాన్ని కోల్పోయినట్లే**
>
> 
>
> జెడ్పీ బడ్జెట్ ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపడం చైర్‌పర్సన్ తన అస్తిత్వాన్ని కోల్పోయినట్లుగా భావించాలి. జెడ్పీ చరిత్రలోనే కోరం కాక వాయిదా పడటం తొలిసారి. గతనెల 29న జరగాల్సిన సమావేశాన్ని 50 శాతం సభ్యులు వాయిదా వేయాలని కోరినట్లుగా జెడ్పీటీసీలకు లేఖలు పంపారు. 50 శాతం మంది వాయిదా కోరి ఉంటే, మూడింట ఒక వంతు సభ్యులతో కోరం ఏర్పాటు చేసి, గత నెల 29నే సమావేశాన్ని ఎందుకు జరపలేకపోయారో ప్రజలకు చెప్పాలి. బడ్జెట్ ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపడం జెడ్పీ ప్రతిష్టను దిగజార్చడంతో పాటు పాలకమండలి సభ్యులను, జిల్లా ప్రజలను అవమానించడమే. పార్టీ ఫిరాయించిన చైర్‌పర్సన్ తక్షణమే రాజీనామా చేయాలి.
>
> – పిల్లి ఓబుల్‌రెడ్డి, రొంపిచర్ల జెడ్పీటీసీ

బడ్జెట్ ఆమోదం తమ వల్ల కాదంటూ ప్రభుత్వానికి నివేదన

బడ్జెట్ సమావేశం వరుసగా రెండుసార్లు వాయిదా పడటంతో ఇక ఆమోదింపచేసుకోవడం తమ వల్ల కాదంటూ ప్రభుత్వానికి నివేదించడం జెడ్పీ పరిపాలన తీరు, తెన్నులకు అద్దం పడుతోంది. గత ఏడాది మార్చి 31 నాటికే ఆమోదించుకోవాల్సిన బడ్జెట్ చివరికి ప్రభుత్వ ఆమోదం కోసం వెళ్లింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.643 కోట్ల ఆదాయంతో రూపొందించిన అంచనా బడ్జెట్‌లో రూ.640 కోట్లు వ్యయం చూపారు. అదే విధంగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాలను మినహాయిస్తే జెడ్పీ బడ్జెట్ రూ.71.11 కోట్ల ఆదాయం, రూ.69.10 కోట్ల మిగులుగా చూపారు.

గుంటూరు డీఆర్‌ఎంగా సుథేష్ణ సేన్ బాధ్యతల స్వీకరణ


సుథేష్ణను అభినందిస్తున్న రామకృష్ణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు డీఆర్‌ఎంగా ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్ (ఐఆర్‌ఏఎస్) సుథేష్ణ సేన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తాజా మాజీ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ సుథేష్ణకు బాధ్యతలు అప్పగించారు. ఎం.రామకృష్ణ సౌత్ వెస్ట్రన్ రైల్వే జోన్‌కు ప్రిన్సిపల్ చీఫ్ సెఫ్టి ఆఫీసర్‌గా వెళ్లనున్న విషయం తెలిసిందే. సేన్ దక్షిణ మధ్య రైల్వేలో 1996 బ్యాచ్‌కు చెందిన వారు. ఆమె ఎకనామిక్స్‌లో ఆనర్స్ గ్రాడ్యుయేట్ డిగ్రీ, పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేశారు. తొలుత ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్‌కు ఎంపికై ముంబై సెంట్రల్ రైల్వేలో ఉద్యోగ బాధ్యతలు ప్రారంభించారు. అక్కడి నుంచి భోపాల్, జబల్పూర్, సౌత్ ఈస్టర్న్ రైల్వే కోల్‌కత్తాలోని వెస్ట్ సెంట్రల్ రైల్వేల్లో పని చేశారు. అత్యంత నిష్ఠాతులైన అధికారిగా గుర్తింపు పొందారు. ఆమె న్యూఢిల్లీలోని నార్తర్న్ రైల్వేలో ఆర్థిక సలహాదారు, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎఫ్‌ఏ అండ్ సీఏఓ)గా పని చేశారు. ఆమె డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, భారత ప్రభుత్వంలోని భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా, ఎన్‌సీఈఆర్‌టీగా డెప్యూటేషన్‌పై బాధ్యతలు నిర్వర్తించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా పనిశారు.

పోలీస్ విచారణకు హాజరైన డాక్టర్ ప్రభావతి



ఒంగోలు టౌన్: మాజీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కస్టడీ కేసు విచారణాధికారి, ఎస్పీ ఏఆర్ దామోదర్ ఎదుట గుంటూరు జీజీహెచ్ రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో ఆమెను 5వ నిందితురాలిగా చేర్చి విచారణ చేస్తున్నారు. సోమవారం ఉదయం విచారణకు వచ్చిన ఆమెను మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత హాజరుకావాలని చెప్పారు. తొలిరోజు సుమారు నాలుగున్నర గంటల పాటు విచారించారు. విచారణలో ఆమె సంతృప్తికరంగా సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. మంగళవారం కూడా ఆమె విచారణకు హాజరుకానున్నారు.

బడ్జెట్ లెక్కలపై అధికారుల వద్ద సమాధానం లేదు

- సుదీర్ఘంగా చర్చ జరగాల్సి ఉంది
- కూటమి సర్కారులో అధికారులు అమ్ముడుపోయారు
- కౌన్సిల్ నుంచి కమిషనర్ బయటకు వెళ్లిపోవడమేమిటీ?
- నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు ధ్వజం


మాట్లాడుతున్న డైమండ్ బాబు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏర్పాటు చేసిన బడ్జెట్‌లో చాలా లోపాలున్నాయని వాటిపై ప్రశ్నిస్తే అధికారుల వద్ద నుంచి ఎటువంటి సమాధానం లేదని నగర డెప్యూటీ వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు) విమర్శించారు. సోమవారం నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ ఆమోద సమావేశం జరిగిన తీరును వజ్రబాబు ఖండించారు. కౌన్సిల్ హాల్ వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. రూ.1534 కోట్లు బడ్జెట్ అంచనాల్లో చూపి, రూ.1018కోట్లు ఖర్చుపెడుతున్నట్లు చెప్పారని, ఈ నిధులు 57 డివిజన్లకు ఏ విధంగా ఖర్చు పెడతారని ప్రశ్నిస్తే సమాధానం లేదని విమర్శించారు. రూ.670కోట్ల ప్రారంభ నిల్వ చూపిన అధికారులు అది ఏయే ఖాతాల్లో ఉందని అడిగితే సమాధానం ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఈ సంవత్సరంలో నగరపాలక సంస్థ ఖర్చు పెట్టబోయే రూ.187కోట్లకు లెక్కల్లో సారూప్యత లేదని, దీనిపై లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశామని వెల్లడించారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఫిక్స్‌డ్ డిపాజిట్స్ కింద రూ.150 నుంచి రూ.200కోట్ల వరకు ఉండాలని, ప్రస్తుతం రూ.45కోట్లు మాత్రమే ఉన్నాయని చెబుతున్నారని విమర్శించారు. సాధారణ ఖర్చుల కింద ఈ సంవత్సరం రూ.169 కోట్లు ఖర్చు పెట్టినట్టు లెక్కల్లో చూపారని, వాటికి ఎలా ఖర్చుపెట్టారో చూపలేదని పేర్కొన్నారు. వీటన్నింటికీ ఎక్కడ సమాధానం చెప్పాల్సి వస్తుందోనని కమిషనర్ పులి శ్రీనివాసులు సీఎంఓలో పనుందని చెప్పి వెళ్లిపోయారని వజ్రబాబు విమర్శించారు. ఇన్‌ఛార్జ్ మేయర్ సజీల అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.అధికారులు కూటమి ప్రభుత్వానికి అమ్ముడుపోయారని ఆయన వజ్రబాబు ఆరోపించారు.

తల్లీబిడ్డకు ఆరోగ్య సమస్యలు రాకుండా చూడాలి


మాట్లాడుతున్న సయ్యద్ జియావుద్దీన్

గుంటూరు లీగల్: ప్రతి బిడ్డా ఆరోగ్యంగా జన్మించాలని, ప్రసవ సమయంలో తల్లీబిడ్డకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ అన్నారు. భవిష్యత్తు తరాల కోసం ఒక బలమైన పునాదిని నిర్మించడమే ముఖ్యోద్దేశమని అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు సోమవారం గుంటూరు జీజీహెచ్‌లోని నర్సింగ్ విద్యార్థులకు, నర్సింగ్ సిబ్బంది, పిల్లల వైద్యశాఖ, ప్రసూతి వైద్య శాఖలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో జియావుద్దీన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తల్లులు, నవజాత శిశువుల మరణాలు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. ప్రతి సంవత్సరం దాదాపు మూడు లక్షల మంది మహిళలు ప్రసవం కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని వెల్లడించారు. ఈ సంఖ్యను తగ్గించడానికి తగు సూచనలు, సలహాలు చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రజలకు అవగాహన కల్పించడంలో, వారికి న్యాయ సహాయం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. సదస్సులో డాక్టర్ అరుణ, డాక్టర్ దేవకుమార్, డాక్టర్ జయంతి, డాక్టర్ ఝాన్సీవాణి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, నర్సింగ్ విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

– ప్రాణాలతో బయటపడిన డ్రైవర్

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం చెరువులోకి కారు దూసుకెళ్లిన ఘటన సోమవారం జరిగింది. మంగళగిరి నుంచి కృష్ణాయపాలెం వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. కారులో డ్రైవర్ ఒక్కరు మాత్రమే వుండగా వెంటనే కారు డోర్ తీసుకుని కారుపైకి ఎక్కి కాపాడాలని అరవడంతో అటుగా వెళ్తున్న స్థానికులు అతడిని రక్షించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

యానాదులపై వేధింపులు తగవు


పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

బాపట్ల టౌన్: లైసెన్సుల పేరుతో యానాదులను వేధించడం సరికాదని యానాది హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరి లక్ష్మయ్య పేర్కొన్నారు. వేటపాలెం పరిసర ప్రాంతాల్లోని యానాదులు తరతరాలుగా చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా మత్స్యశాఖ అధికారుల పేరు చెప్పి కొందరు లైసెన్సుల పేరిట ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ వారు వాపోతున్నారు. సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చి యానాదులు వివిధ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో రాస్తారోకో చేశారు. పొట్లూరి లక్ష్మయ్య మాట్లాడుతూ.. వేటపాలెం పరిధిలోని నిరుపేద యానాదులు ఎన్నో తరాలుగా చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. లైసెన్సులు లేవనే పేరుతో వేధించడం అప్రజాస్వామికమన్నారు. దీనిపై తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యానాది హక్కుల పరిరక్షణ సమితి బాపట్ల జిల్లా అధ్యక్షులు సీహెచ్ శంకర్, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. అనంతరం పట్టణంలోని చీలురోడ్డు సెంటర్ నుంచి ర్యాలీగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. కొమరగిరి శ్రీను, పుట్టా వెంకటేశ్వర్లు, కొమరగిరి అయ్యప్ప, సైకం రమేష్, చేవూరి వెంకట్రావు, మల్లవరపు కృష్ణ, పుట్ట వెంకటేశ్వర్లు, బీఎస్పీ నాయకులు గుదే రాజారావు పాల్గొన్నారు.

మూడో కన్ను మసకబారింది!

- నకరికల్లులో మొరాయించిన సీసీ కెమెరాలు
- 2023లో రూ.4 లక్షలు వెచ్చించి 28 కెమెరాలు ఏర్పాటు
- ఫుటేజీ సాయంతో ఎన్నో కేసులు సత్వరమే ఛేదించిన పోలీసులు
- గత కొన్నిరోజులుగా ఏ ఒక్కటీ పని చేయని వైనం
- ప్రశ్నార్థకంగా మారిన ప్రజాభద్రత



నకరికల్లు: 2023 జులైలో స్థానిక ఇందిరమ్మకాలనీలోని ఒక ఇంట్లో చోరీ జరిగింది. సుమారు రూ.7లక్షల నగదు, కొంత బంగారం చోరీకి గురైంది. చోరీ కేసు నమోదు చేసిన పోలీసులు వారం రోజుల్లోనే కేసును ఛేదించగలిగారు. సొత్తును రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.

– అదే ఏడాది ఆగస్టులో హైవే పక్కన ఉన్న ఏటీఎం ధ్వంసం చేసిన ఘటనలోను నిందితుడిని ఒక్కరోజులోనే పట్టుకోగలిగారు. అంత త్వరగా కేసులు ఛేదించడానికి పోలీసులకు ఉపయోగం పడిన ఆయుధం సీసీ కెమెరా.. ఇలా ఎన్నో కేసులను అతితక్కువ సమయంలో పోలీసులు ఛేదించగలిగారంటే అది కేవలం సీసీ కెమెరాలు అందించిన ఆధారాలే. 2023లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో 2023 సంవత్సరంలో నకరికల్లు గ్రామంలోని ప్రధాన కూడళ్లలో, అలాగే అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రూ.4 లక్షలు వెచ్చించి 28 పెద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎక్కడ ఏ మూలన ఏం జరిగినా పోలీస్ కంట్రోల్ రూంలో రికార్డయి తెలిసిపోయేది. చోరీలు అరికట్టేందుకు, చోరీ కేసుల్లోని, రోడ్డు ప్రమాదాల్లో నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషించాయి. సీసీ కెమెరాలు ఇచ్చిన క్లూ ఆధారంగా ప్రమాదానికి కారణమై తప్పించుకుపోయిన నిందితులను వాహనాలతో సహా గుర్తించారు. ఇలాంటి ఎన్నో ఘటనలకు కారణమైన ఆధారాలను అందించిన సీసీ కెమెరాలు గత కొన్నిరోజులుగా ఏ ఒక్కటీ పనిచేయడం లేదు. దీంతో గ్రామస్తులు మళ్లీ భయం నీడన బతకాల్సి వస్తుంది.

ఒక్కటీ పని చేయడం లేదు..

సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో మళ్లీ ఇటీవల కాలంలో ఘర్షణలు, చోరీలు జరుగుతున్నాయని రోడ్డుపక్కన గృహాల వారు, శివారు ప్రాంతంలో నివాసముంటున్న వారు, దుకాణదారులు వాపోతున్నారు. వేసవి కావడంతో ఎక్కువగా దొంగతనాలు జరుగుతుంటాయి. అందునా సెలవుల కాలంలో ఇళ్లకు తాళాలు వేసి కుటుంబసమేతంగా ప్రజలు ఊళ్లకు, యాత్రలకు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో ఆస్తుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. అందునా అద్దంకి – నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన గ్రామం కావడంతో చోరీలతో అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. గతంలో జరిగిన చోరీల నేపథ్యంలో సీసీకె మెరాలు పనిచేయడం లేదన్న సమాచారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతుకు గురైన సీసీ కెమెరాలు సత్వరమే వినియోగం తేవాలని ప్రజలు కోరుతున్నారు.

> **సాంకేతిక లోపాలు సరిచేయిస్తున్నాం**
>
> 
>
> సీసీ కెమెరాల నిర్వహణలో చిన్న చిన్న సాంకేతిక లోపాలు తలెత్తాయి. టెక్నీషియన్ల సహాయంతో లోపాలను గుర్తించి మరమ్మతులు చేయించి సత్వరమే వినియోగంలోకి తీసుకువస్తాం. శాంతిభద్రతలకు అన్నివిధాల టెక్నికల్‌గా చర్యలు తీసుకుంటాం.
>
> – చల్లా సురేష్, ఎస్‌ఐ, నకరికల్లు

తండ్రి మందలించాడని బాలిక ఆత్మహత్య

నకరికల్లు: తండ్రి మందలించాడనే కోపంతో బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కుంకలగుంట గ్రామంలోని సుగాలితండాకు చెందిన రమావత్ అనూషబాయి (16) 7వ తరగతి చదువుతూ చదువు సక్రమంగా రావడం లేదని మానేసి పొలంపనులకు వెళ్తుంది. పొలంపనులకు వెళ్లవద్దని కుట్టు మిషన్ పని నేర్చుకోవాలని తండ్రి మందలించినందుకు మార్చి 31న ఎలుకల పేస్టు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యకోసం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 6వ తేదీన మృతిచెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు.

ఎరువుల వ్యాపారి ఉడాయింపు


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న తాళ్ళపల్లి గ్రామ రైతులు

మాచర్ల రూరల్: ఫర్టిలైజర్ వ్యాపారి నగదుతో ఉడాయించడం స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు నాళం అమర నాగేశ్వరరావు ఎరువులు, పురుగు మందుల వ్యాపారం చేస్తూ గ్రామంలో సుమారు 50 మందికి పైగా రైతుల వద్ద రూ. 2.50 కోట్ల మేర అప్పులు తీసుకున్నాడు. కొందరి వద్ద పంట కొనుగోలు చేసి, మరికొందరి వద్ద ప్రామిసరీ నోట్లు, స్థలాలు, పొలాలు, అమ్మకం అగ్రిమెంట్లు రాసి నగదు తీసుకొని పరారయ్యాడు. సోమవారం గ్రామానికి చెందిన రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ బి.కిరణ్ కుమార్‌ను వినతి పత్రం అందించారు. తనకు చెందిన పొలం, ఇళ్లు, స్థలాలు విక్రయిస్తానని అగ్రిమెంట్ రాసి రెండు రోజుల నుంచి కనిపించకుండా వెళ్లాడని, ఇంటికి తాళం వేసి సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ కుటుంబ సభ్యులు మొత్తం కన్పించటం లేదని వారు తహసీల్దార్‌కు తెలిపారు. అమర నాగేశ్వరరావుకు చెందిన ఆస్తులను ఇతరులకు అమ్మకుండా వచ్చే నగదును రైతులమైన మాకు చెందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీని పై స్పందించిన కిరణ్ కుమార్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, రూరల్ పోలీసులను సంప్రదించాలని సూచించారు. దీంతో వారు ఆయా కార్యాలయాలకు వెళ్ళి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందించినట్లు తెలిపారు.

■ ఇదిలా ఉండగా గత ఆరు నెలల కాలంలో సుమారు రూ. 100 కోట్ల వరకు వివిధ వ్యాపార వర్గాలు ఐపీ నోటీసులు దాఖలు చేయటం మాచర్ల పట్టణంలో సంచలనం రేకెత్తిస్తుంది. అప్పులిచ్చిన వ్యాపారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు.